క్లుప్తంగా

మద్దికెర ఎంపీడీఓగా నరసింహమూర్తి



మద్దికెర : మండల అభివృద్ధి అధికారిగా నరసింహమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాకు వెళ్లిన ఎంపీడీఓను సొంత జిల్లాకు బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

జాతీయ భావాలు పెంపొందేందుకు దోహదం



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి(పత్తికొండ) : జాతీయ భావాలు పెంపొందేందుకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు పేర్కొన్నారు. కేంద్రం నుంచి పోస్టాఫీసుకు వచ్చిన జాతీయ జెండాను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కృష్ణగిరి: కృష్ణగిరి మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించి అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన రాబర్ట్‌విల్సన్‌ను మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా వచ్చిన ఆయన ఇటీవల స్వంత జిల్లాకు వెళ్లారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామస్వామి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మిదేవి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుందలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



హొళగుందలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హొళగుంద: ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం హొళగుందలో మంగళవారం బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వాల్మీకి సర్కిల్, బస్టాండ్ తదితర ప్రాంతాలతో పాటు వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏఈ ఎస్ ప్రసాద్, నాయకులు చిదానంద, జక్కన్నాచారి, బీజేవైఎం మండలాధ్యక్షుడు బసవ, చిన్న, వీరేశ్, ఉలిగన్న, మహేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని పందిర్లపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వీపర్ విషయంలో మంగళవారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గంలోని ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాజావలి తెలిపారు. నడిపి రంగన్న ఫిర్యాదు మేరకు లక్ష్మన్న, భూలక్ష్మితోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. అయితే దాడిలో ఇరువర్గాలకు చెందిన వారికి గాయాలు కాగా ఒక వర్గానికి చెందిన వారిపై కేసు నమోదు చేయడం ఏంటని మరోవర్గం ఆరోపిస్తుంది. ఈ విషయంపై ఎస్‌ఐ మాట్లాడుతూ విచారించి మరో వర్గంపై కూడా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



హులేబీడు గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ సీవీ నరసింహులు

ఆలూరు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆలూరు ఎస్‌ఐ సీవీ నరసింహులు హెచ్చరించారు. మండలంలోని హులేబీడు గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో గుట్టుగా మట్కా, నాటుసారా తయారీ, కర్ణాటక మద్యం రవాణా, విక్రయ దారులు ఉంటే వెంటనే మాను కోవాలని సూచించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కృష్ణగిరి: గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వాములు కావాలని శిక్షణ కార్యక్రమ స్టేట్ అబ్జర్వర్ వెంకటరత్నం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల నిర్వహణపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అయితే శిక్షణ కార్యక్రమానికి ఒక్క సర్పంచ్ మాత్రమే హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడాల్సిన ప్రజాప్రతినిధులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామస్వామి, ట్రైనర్లు శ్రీధర్‌మూర్తి, మస్తాన్‌వలి, సుంకన్న, అనూష తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర : మండల అభివృద్ధిలో పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు బాగస్వాములు కావాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శిక్షకులు సుధాకర్, పరమేష్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ తడి చెత్త, పొడి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవానలి, సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచులు మల్లికార్జున, ఆంజనేయులు, రాజగోపాల్‌రెడ్డి, ఏఈ మయాంక్, సచివాలయ కార్యదర్శులు అరుణకుమారి, రేణుక, హరి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.





బంటణహాలులో వర్మీ కంపోస్ట్ తయారీ గురించి వివరిస్తున్న డీపీఆర్‌సీ ఉమామహేశ్వరి , పత్తికొండలో సంపద కేంద్రం వద్ద సర్పంచ్‌లు

కొనసాగుతున్న శిక్షణ

చిప్పగిరి: గ్రామాల అభివృద్ధిపై మూడు రోజుల పాటు మండలంలోని సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా మంగళవారం బంటణహాలు గ్రామంలో డీపీఆర్‌సీ ఉమామహేశ్వరి సర్పంచ్‌లతో కలసి పర్యటించారు. చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి గ్రామాల సర్పంచులకు వివరించారు. అలాదే పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో ఆర్థిక వనరులు పెంపు

తుగ్గలి(పత్తికొండ) : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలో తేవడం ద్వారా పంచాయతీల ఆర్థిక వనరులను పెంచుకోవచ్చని ట్రైనర్లు కార్తీక్‌రంగనాథ్, శివ, పవన్, రామకృష్ణ పేర్కొన్నారు. పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా రెండరోజు మంగళవారం పత్తికొండ, తుగ్గలిలో సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో వీటి పనితీరుపై వివరించారు. ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరుచేసి కేంద్రానికి తరలించేలా చూడాలన్నారు.



కృష్ణగిరి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ వెంకటరత్నం



మద్దికెరలో మాట్లాడుతున్న శిక్షకుడు పరమేష్

నీటి వృథాను అరికట్టండి

- తుంగభద్ర నీరు వృథా అయితే రాయలసీమ ఎడారే
- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

చిప్పగిరి: తుంగభద్ర డ్యాం 19వ గేట్‌ను తక్షణమే ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిప్పగిరిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మట్లాడుతూ.. డ్యాం లోని నీరు మొత్తం దిగువకు వదలిన తర్వాత మరమ్మతులు చేస్తే రైతాంగానికి పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. 105 టీఎంసీలు నిల్వ సామర్థ్యం ఉన్న డ్యాంలో నీరు పుష్కలంగా ఉండడంతో కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు వేలాది ఎకరాలు సాగు చేశారని, ఇప్పుడు గేట్ కొట్టుకుపోవడం ద్వారా నీరు మొత్తం దిగువకు పోతుందన్నారు. మరలా వర్షాలు కురువక పోతే కనీసం తాగడానికి కూడా గుక్కెడు నీరు అందదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ మారయ్య, నాయకులు ఓబులేష్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వెల్దుర్తి: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెల్దుర్తి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. అదేవిధంగా బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స పొందుతున్న వెల్దుర్తి టౌన్‌కు చెందిన రిటైర్డ్ లైన్‌మెన్ ఫకృద్దీన్ ఆమె పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకుఆమె సూచించారు.

చోరీకి యత్నంచిన యువకుడికి దేహశుద్ధి



పోలీసుల అదుపులో యువకుడు

వెల్దుర్తి: వెల్దుర్తి పట్టణంలో పట్టపగలు చోరీకి యత్నించిన దొంగను ఇంటి యజమాని పట్టుకోగా కాలనీవాసులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ముల్లా వీధిలోని షేక్షావలి ఇంటిలో గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, ఉద్దండాపురం గ్రామానికి చెందిన యువకుడు అశోక్‌కుమార్‌రెడ్డి చోరీకి యత్నించాడు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగదు, నగల కోసం వెతుకుతున్నాడు. ఇంటి యజమాని షేక్షావలి ఇంటి తలుపులు తెరిచి ఉంచడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లగా దొంగ పారిపోయేందుకు ప్రయత్నించాడు. యజమాని కేకలు వేసి అతన్ని పట్టుకున్నాడు. వెంటనే కాలనీవాసులు అక్కడికి చేరుకుని దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని పలు ఇళ్ల తాళాలు పగులగొట్టినట్లు యువకుడు ఒప్పుకున్నట్లు ఏఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. ఈ దొంగ ఒక్కడే వచ్చాడా, లేక టీంతో వచ్చాడా, ఇంకా ఏఏ ఇళ్లలో దొంగతనం చేశాడు తదితర విషయాలు పోలీసుల విచారణలో తెల్చాల్సి ఉంది.

పర్యావరణాన్ని కాపాడండి

వెల్దుర్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వెల్దుర్తి సీఐ మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం డోన్ పట్టణానికి చెందిన స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. మొక్కటు నాటేందుకు సహకారం అందించిన నంద్యాలకు చెందిన న్యాయవాది వాసగిరి కృష్ణలింగయ్య, సుమలత దంపతులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన, సేవా సమితి సభ్యులు మధు, మోహన్ రెడ్డి, నారాయణస్వామి, జనవిజ్ఞాన వేదిక క్యారద్ది బలిజ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మధుసూదన్‌రావు

బీసీ బాలుర వసతి గృహాన్ని పునఃప్రారంభించాలి



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

దేవనకొండ: మండలకేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించాలని, బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నిత్యం కరువు, కాటకాలకు నిలయంగా మారిందన్నారు. కరువుతో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా హాస్టల్‌ను పునః ప్రారంభిస్తే విద్యార్థులు అందులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్, నాయకులు ఉమేష్, అరవింద్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న బిల్లేకల్లు మార్కెట్



బిల్లేకల్లు మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చిన రైతులు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయల మార్కెట్లో మంగళవారం కూరగాయల వేలాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 5న టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఆస్పరి సీఐ హనుమంతప్పపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈనెల 6వ తేదీ నుంచి పోలీసులు మార్కెట్‌ను బంద్ చేయించారు. దీంతో రైతులు పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని 'సాక్షి'లో ఈనెల 11వ తేదీన 'అధికార దౌర్జన్యం.. రైతన్నకు నష్టం' అనే శీర్షిక

సాక్షి ఎఫెక్ట్

కథనం ప్రచురితమైంది. కథనానికి పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసురెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆస్పరి సీఐ మస్తాన్ వలి మంగళవారం మార్కెట్ దగ్గరకు వెళ్లి కూరగాయల వేలాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామల నుంచి కూరగాయలను రైతులు అమ్ముకొని వెళ్లారు. వేలాలు ప్రారంభమైనందుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు ఎల్లార్తి దర్గా పరిసరాల్లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. హొళగుంద బీసీ కాలనీ, నేతాజీ పాఠశాల పరిసరాలులో సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లోని డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పొడర్ చల్లించారు. అదేవిధంగా ఎల్లార్తి దర్గా పరిసరాలను మంగళవారం గ్రామపెద్ద మల్లికార్జున ఆధ్వర్యంలో చెత్తాచెదారం, చెత్త కుప్పలు, డ్రైనేజీలలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు.



హొళగుంద బీసీ కాలనీలోని డ్రైనేజీలో పూడిక తీస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారి పట్టణానికి చెందిన భార్య, భర్తలు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారి పట్టణానికి చెందిన మస్తాన్, భార్య సుధతో కలసి రెండు రోజులు క్రితం ఆదోనికి వెళ్లాడు. మంగళవారం ఆదోని నుంచి ఆటోలో బళ్లారికి తిరుగు పయనమయ్యారు. ఆలూరు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని మోటార్ బైక్ వారి ఆటోను బలంగా ఢీ కొట్టడంతో వారు కింద పడిపోయారు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యా యి. స్థానికులు వెంటనే ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించారు.

హొళగుంద ఎస్‌ఐగా బాల నరసింహులు

హొళగుంద: హొళగుంద ఎస్‌ఐగా బాల నరసింహులును నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న పెద్దయ్య నాయుడును కర్నూలు వీఆర్‌కు పంపగా ఆయన స్థానంలో కర్నూలు వన్ టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న బాల నరసింహులు నియమించారు.

రైతులు సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

కృష్ణగిరి: కృష్ణగిరి, కోయిలకొండ గ్రామాల్లోని వ్యవసాయ సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని ఈ సంఘాల సీఈఓలు శివన్న, రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రైతులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, సభ్యత్వాలు యథావిధిగా కొనసాగాలంటే పత్రాలు అందజేయాలన్నారు. పొలం పాసుపుస్తకం, సహకార సంఘం బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్, పాన్ కార్డులతోపాటు రెండు ఫొటోలను సహకార సిబ్బందికి అందజేయాలన్నారు. ఆధారాలు అందజేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు వర్తించవని చెప్పారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

ఆస్పరి: మండలంలో ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 13వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు. ఈనెల 16న తంగరడోణ, 17న తురువగల్లు, 20న నగరూరు, 21న చిగిళి, 22న బిణిగేరి, 23న హలిగేర, 24న చిరుమాన్‌దొడ్డి, 27న ఆస్పరి, 28న శంకరబండ, 29న చొక్కనహళ్లి, 30న చిన్నహోతూరు, 31న జొహరాపురం, సెప్టెంబర్ 3వ తేదీన బిల్లేకల్లు, 4న ముత్తుకూరు, 5న యాట కల్లు, 6న కైరుప్పల, 10వ తేదీన కారుమంచి, 11న డీ కోటకొండ, 12న ములుగుందం, 13న బనవ నూరు గ్రామాలలో సదస్సులు ఉంటాయని చెప్పారు.

పంటపొలాలకు నీటిని విడుదల చేయండి

దేవనకొండ: పందికోన రిజర్వాయర్ నుంచి కుడి ఎడమల కాలువల ద్వారా పంట పొలాలకు నీటిని వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు యూసుఫ్‌బాషా, మహబూబ్‌బాషా కోరారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి దేవనకొండ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ మొదలై 80 రోజులు కావస్తుందని, సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం హంద్రీనీవా నుంచి వెంటనే నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవనకొండ, పల్లెదొడ్డి, కుంకనూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ

తుగ్గలి(పత్తికొండ) : పట్టణంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్, తిరంగా' బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కో కన్వీనర్ గోవర్దన్ మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ, వివిధ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



హొళగుంద తేరుబజారులో నిలిచిన వర్షపు నీరు

హొళగుందలో వర్షం

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షానికి వాగులు, వంకలు, వీధుల్లో నీళ్లు పారాయి. హొళగుందలో హైస్కూల్ గ్రౌండ్, ఎస్‌బీఐ బ్యాంకు, తేరుబజారులో నీరు చేరాయి. చాల రోజులుగా వర్షం మొహం చాటేయడంతో పంటలన్నీ వాడుముఖం పట్టాయి. ఈ వర్షంతో రైతులకు ఊరట కలిగింది.

విధినిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఆలూరు: ఉద్యోగ విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడనాడి ప్రజలకు జవాబుదారీగా నిలిచి పనిచేసినప్పుడే అందరి మన్ననలను పొందే అవకాశం ఉందని తహసీల్దార్ గోవిందు సింగ్ అన్నారు. మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బందితో సమావేశమైయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా సివిల్ సప్లై స్టాక్ పాయింట్ నుంచి వినియోగదారులకు ప్రజా పంపిణీ సక్రమంగా జరగాలన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు , అధికారులు తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. డీటీ రజనీ కాంత్‌రెడ్డి, ఆర్‌ఐ బసన్నగౌడు, ఎలక్షన్‌డీటీ గుండాల నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

- ఆర్డీఓఎస్ రామలక్ష్మి

తుగ్గలి(పత్తికొండ) : విద్యార్థులకు మెరుగైన విద్య నందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆర్డీవో ఎస్ రామలక్ష్మి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జేఎంతండా ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోర్డుపై లెక్కలు రాసి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఆర్డీవో సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులు కళ్యాణి, నాగభూషణంను అభినందించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆర్డీవో హామీ ఇచ్చారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

మాలలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

హాలహర్వి: మాలలంతా ఐకమత్యంతో ఉంటూ పోరాటాలకు సంసిద్ధం కావాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయి రామ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది, నాయకులు చంద్ర, లింగప్ప పిలుపునిచ్చారు. మంగళవారం హాలహర్విలోని దుర్గమ్మ గుడి ఆవరణలో ఎంపీటీసీ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దళితుల ఐక్యతను దెబ్బతీసేవిధంగా ఉందన్నారు. బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని మార్చేవిధంగా రిజర్వేషన్లను క్రమబద్ధీకరణ పేరుతో ఎత్తివేసేందుకు కుట జరుగుతుందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమానికి మాలలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, గాదిలింగప్ప, మారేష్, వెంకప్ప, దర్గప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరామ్

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



ఆస్పరిలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఆస్పరి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు మంగళవారం ఆస్పరిలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో వరదలతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పరిలో చిన్నచిన్న వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు, కూలీలతో రూ.10.150వేలు విరాళాలు సేకరించినట్లు తెలిపారు. ఈ విరాళాలను సీపీఎం రాష్ట్ర సమితికి పంపనున్నట్లు చెప్పారు. మానవతా దృక్పథంతో సహాయం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగస్వామి, రామాంజినేయులు, వెంకట్రాముడు, కాశన్న, రవి పాల్గొన్నారు.

ఉపాధిలో పనుల్లో రూ. లక్ష అవినీతి

కృష్ణగిరి: ఏడాది కాలంగా జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించగా లక్ష రుపాయలు అవినీతి జరిగినట్లు గుర్తించామని డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన దాదాపుగా రూ.9 కోట్ల పనులకు సంబంధించి గత నెల 29 నుంచి ఈ నెల 12 వరకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారన్నారు. రూ. లక్ష వరకు అవినీతి జరిగినట్లు గుర్తించారని, ఇప్పటికే రూ.69,208 రికవరీ చేశామన్నారు. అలాగే పనులు మంజూరైన చేపట్టని గ్రామ పంచాయతీలకు రూ.27వేలు పెనాల్టీ విధించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మాధవీలత, జిల్లా విజిలెన్స్ అధికారి భాస్కర్, అంబుడ్స్‌మన్ చంద్రశేఖర్, గంగాధర్, ఏపీడీ లక్ష్మన్న, అసిస్టెంట్ డీవీఓ ఆదినారాయణ, ఏపీఓ శేషిరెడ్డి, ఆడిట్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సమాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి